క్లుప్తంగా

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి


వెంకట నారాయణ (ఫైల్)

యర్రగొండపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఊట్ల వెంకట నారాయణ (53) శుక్రవారం వేకువ జామున గుండెపోటుతో మృతి చెందారు. నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో తన సిబ్బందికి ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకున్నాడు. తీవ్ర అస్వస్థతతో ఉన్న ఆయన్ను మోటారు బైక్‌పై ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే వెంకట నారాయణ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించాడు. త్రిపురాంతకం మండలం మిట్టపాలెం గ్రామానికి చెందిన ఆయన పల్నాడు జిల్లా నరసరావుపేటలో స్థిరపడ్డారు. ఆయన భార్య గృహిణి కాగా కుమారుడు కెనడాలో ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె అమెరికాలో విద్యను అభ్యసిస్తోంది. ఆదివారం నరసరావుపేటలో అంత్యక్రియలు జరుగుతాయని ఆయన బంధువులు తెలిపారు. వెంకటనారాయణ మృతికి ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైస్ ఎంపీపీలు ఎం.ఆదిశేషు, ఉనాది బాలమ్మ, ఎంపీడీవో బి.శ్రీనివాసులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి


సూర్యనారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కురిచేడు: ఉద్యోగం చేసే ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పని సరని మండల విద్యాధికారి సీహెచ్ సుబ్బారెడ్డి తెలిపారు. పడమర వీరాయపాలెం ఎస్‌జీటీ పాఠశాల ఉపాధ్యాయుడు తుమ్మల నాగేశ్వరరావు గురువారం పదవీ విరమణ పొందారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్రరావు అధ్యక్షతన పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది అందరి మన్ననలు పొందారని, వివాదరహితుడు, నిగర్వి, ఎల్లప్పుడూ సంతోషంగా అందరితో కలిసిమెలిసి ఉండే లక్షణం సూర్యనారాయణకు ఉందని ప్రశంసించారు. అనంతరం ఆయన్ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమానికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడి జీర్ణోద్ధరణలో బూచేపల్లి

చీమకుర్తి రూరల్: మండలంలోని కేవీ అగ్రహారం గ్రామంలో పోలేరమ్మ గుడి జీర్ణోద్ధరణ చేశారు. శుక్రవారం ఉదయం పునః ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పూజలు చేశారు. సర్పంచ్ దేవరపల్లి వెంకటలక్ష్మి రామారావు, రాము, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నన్నారి..ఉపాధి దారి!

- క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఊపందుకున్న నన్నారి విక్రయాలు
- తయారీదారులకు మూడు నెలల పాటు ఉపాధి


పెద్దదోర్నాలలో షరబత్ విక్రయిస్తున్న యువకుడు

పెద్దదోర్నాల:

నన్నారి షరబత్ అంటే జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో తెలియని వారుండరు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో సుగంధ పాలుగా కూడా పిలుస్తుంటారు. సాధారణ రోజుల్లోనే చాలామంది ఈ పానీయాన్ని ప్రియంగా తాగుతుంటారు. అలాంటిది వేసవి కాలంలో అయితే ఈ పానీయానికి ఉండే డిమాండే వేరు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నన్నారి అమ్మకాలతో దుకాణాలు కిక్కిరిసి ఉంటాయి. దీంతో ఈ షరబత్ తయారు చేసే కుటుంబాలకు చేతి నిండా పని ఉంటుంది. వేసవి సమీపిస్తుండటంతో నన్నారి తయారీని మండల కేంద్రంలో చాలా మంది చేపడుతున్నారు. వేసవి కాలం వచ్చిందంటే చాలు నన్నారి షరబత్‌కు తయారీకి వినియోగించే సుగంధ వేర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలి వచ్చే వేలాది మంది ప్రయాణికులతో మండల కేంద్రం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు నన్నారికి వ్యాపారానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

నన్నారి తయారీ సులభం

కిలో నన్నారి వేర్లను ఉడికించటం ద్వారా 25 లీటర్ల నన్నారిని తయారు చేయవచ్చు. లీటరు నన్నారి 130 రూపాయల నుంచి 200 రూపాయల వరకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. లీటరు నన్నారికి సోడాతో పాటు కొద్దిగా నిమ్మ రసం కలపటం ద్వారా 20 గ్లాసుల నన్నారి షరబత్ తయారు అవుతుంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనుల నుంచి సేకరించిన నన్నారి వేర్లను సమీకృత గిరిజన సహకార సంస్థ ద్వారా కొనుగోలు చేసుకొని నన్నారి షరబత్ తయారు చేసుకోవచ్చు.

నన్నారి షరబత్‌తో ఎన్నో ఉపయోగాలు

నోరూరించే రుచి, సువాసనతో ఉండే నన్నారి షరబత్ మండు వేసవిలో దాహార్తి తీరుస్తుంది. శరీరంలో అధిక ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. మూత్ర సంబంధిత సమస్యలకు మందుగా పని చేస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. హార్మోన్ల సమతుల్యతను పెంపొందిస్తుంది. జీర్ణ ప్రక్రియ సమతుల్యంగా సాగేలా చేస్తుంది. శరీర బరువును నియంత్రణలో ఉండేలా ఉపకరిస్తుంది.

శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి


చిన్నారిని దీవిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

దొనకొండ: మండలంలోని యర్రబాలెంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త పెన్నిక కాశయ్య కుమార్తె పుష్పాలంకరణ కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం రాత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారికి అక్షతలు వేసి దీవించారు. ఒబ్బాపురంలో కొండా కాశయ్య రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వహించి గురువారం పదవీ విరమణ సందర్భంగా డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విచ్చేసి కాశయ్యను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, బత్తుల వెంకట సుబ్బయ్య, నూనె వెంకటరెడ్డి, పాతకోట కోటిరెడ్డి, కాలూరి రమణయ్య, పత్తికొండ వెంకట సుబ్బయ్య, ఇమ్రాన్‌ఖాన్, బండారు రాజు, గుంటు పోలయ్య, ఇండ్ల శ్రీనివాసరావు, గుమ్మా వెంకటేశ్వర్లు, గొంగటి పోలిరెడ్డి, భీమిని వెంకటేశ్వర్లు, పులిమి శివ, కె.ప్రసాద్, తమ్మనేని సుబ్బారెడ్డి, తాల్లూరి నగేష్, ఐలూరి శ్రీనివాస రెడ్డి, జొన్నకూటి సుబ్బారెడ్డి, గోనె జాకోబు, వినుకొండ కొండలు, పులిమి గురవయ్య, బుజ్జి, బాపనపల్లి శ్రీను, చీర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ప్రజలను భయపెడుతున్న కోతులు

కోతుల స్వైరవిహారం

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం, సోమవరప్పాడు గ్రామాల్లో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల చిన్న పిల్లలు, మహిళలపై వరుసగా దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. రోడ్డుపైకి జనాలు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లలోకి వచ్చి వస్తువులు తీసుకెళ్తున్నాయి. చిన్నారుల చేతుల్లోని తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. గ్రామ ప్రజలు చాలాసార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. కోతులు బెడద నుంచి ప్రజలను రక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు (దర్శి): తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ మహ్మద్ ఫరూక్ సూచించారు. మండలంలోని కెల్లంపల్లిలో జీఏపీ పొలం బడి శిక్షణ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ పంట నాటే ముందు విత్తన శుద్ధి తప్పని సరిగా చేసుకోవాలన్నారు. ట్రైకోడెర్మా విరిడి 10 గ్రాములు కేజీ విత్తనానికి కలిపి విత్తితే ఎండు తెగులు, వేరుకుళ్లు వంటి తెగుళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. పిచికారీ మందులతో మానవులపై విష ప్రభావాన్ని చూపే చార్టు గీసి పొలం బడి సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఫరూక్

రోడ్డు భద్రత అందరి బాధ్యత


బైక్ ర్యాలీలో ఎంవీఐ, ఇతర అధికారులు

దర్శి: రోడ్డు భద్రత అందరి బాధ్యతని ఎంవీఐ రవికుమార్ అన్నారు. జాతీయ భద్రత వారోత్సవాలు పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో హెల్మెట్‌లు పెట్టుకుని మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని హెల్మెట్, కారు సీట్ బెల్ట్‌పై అవగాహన కల్పించారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కితే జరిమానాలు విధిస్తామని చెప్పారు. డ్రైవర్‌కు ఇరువైపులా ఎవరూ ఎక్కరాదన్నారు. మద్యం తాగి వాహనాలు తోలినట్లు తెలిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కిస్తే అవి మరమ్మతులకు గురవుతాయని, వాహనాలు కంట్రోల్ కాక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల అలాంటి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. వాహనాలు నడిపే వారు ఇంటి వద్ద తమ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని ఎంవీఐ సూచించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుల్లలచెరువు: ఇటీవల మండలంలోని మానేపల్లి గ్రామంలో ఎస్సీ పాలేనికి చెందిన కొండా ఆశోక్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ ఆశోక్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇకపై మండలంలోని ఏ గ్రామంలో దళిత బిడ్డపై దాడి జరిగితే ఊరుకునేది లేదని, న్యాయం జరిగేంత వరకూ దళిత సంఘాలు ఉద్యమాన్ని ఉధృతం చేస్తాయని హెచ్చరించారు. నాయకులు ఇస్సాక్ మాదిగ, ఓబులు, ప్రసాద్, ఆంజనేయులు, మరియదాసు, బక్కయ్య, ఏసోబు, నాగేష్, సురేష్, ఏసుదాసు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి


బాధితురాలు శివమ్మతో మాట్లాడుతున్న నాయకులు

- కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో గిరిజనుడు మాట వెంకటేశ్వర్లు, అతని భార్య శివమ్మపై దాడి చేసి ఇల్లు, రేకుల షెడ్, ఆటో, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేసిన 14 మందిని వెంటనే అరెస్టు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి ప్రభుత్వాని డిమాండ్ చేసింది. కేఎన్‌పీఎస్ నిజ నిర్ధారణ బృందం రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించింది. రుద్రసముద్రంలో ఎరుకల కులానికి చెందిన మాట వెంకటేశ్వర్లు కుటుంబం ఆత్మ గౌరవంతో జీవిస్తోందని, కష్టపడి నిర్మించుకున్న స్వశక్తితో నడుపుతున్న ఆటోను, చికెన్ దుకాణం నడుపుకుంటూ జీవిస్తుంటే ఓర్వలేక అగ్రవర్ణాల వారు మహిళను అడ్డు పెట్టుకుని మాట వెంకటేశ్వర్లుపై ఆరోపణ చేసి వారి కుటుంబాన్ని దాదాపు 50 మంది కలిసి అతని భార్య శివమ్మను ఇంటి గేటుకు కట్టేసి భీభత్సం సృష్టించి దాడి చేసి ఆస్తి నష్టపరిచి భయాందోళన వాతావరణం సృష్టించారని మండిపడ్డారు. ఆ దాడిని పోలీసులు కూడా అదుపు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి విచారణ లేకుండా మాట వెంకటేశ్వర్లును రిమాండ్‌కు పంపిన పోలీసులు నలుగురు నిందితులను మాత్రమే అరెస్టు చేశారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు దళిత, గిరిజనులకు రక్షణ కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడవక ముందే రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై గ్రామాల్లో దాడులకు తెగబడుతున్నారన్నారు. నిందితులను కూటమి ప్రభుత్వం కాపాడుతోందని నిజ నిర్ధారణ కమిటీ పేర్కొంది. ప్రజలను కాపాడాల్సిన పోలీసులు ఒక వర్గానికి కొమ్ము కాస్తూ మరో వర్గాన్ని ఇబ్బందికి గురి చేస్తోందని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి పోలీసు వ్యవస్థ రక్షణ ఏం కల్పిస్తారోనని ప్రశ్నించారు. మాట వెంకటేశ్వర్లుపై కేసు ఎత్తివేసి కమ్మ కులం వారిపై కేసు నమోదు చేసి ఎరుకల కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని నిజనిర్ధారణ కమిటీ కోరింది. కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కోటయ్య, మండల అధ్యక్షుడు జి.చిన్నఏసు, ఉపాధ్యక్షుడు జి.మోషే, మరియదాసు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం


అమ్మవారిశాలలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు


ప్రత్యేక పూజల్లో భక్తులు

పెద్దదోర్నాల: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పుష్పలంకరణ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, అమ్మవారికి క్షీరాభిషేకం, ఫలోదకాభిషేకం, శుద్ధజలాభిషేకం, సహస్రనామార్చన, ఉదయం 8.30 గంటలకు కోనేటి నుంచి కలశాలు తీసుకుని రావటం, 9 గంటలకు వైశ్యపతాకావిష్కరణ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు 108 మంది యువతులు దేవిఖడ్గమాల యంత్రాలచే కుంకుమపూజ, అమ్మవారి కథ పరిచయం అనంతరం ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బెదరె రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పుష్పాలంకరణ, అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పబ్బిశెట్టి సుబ్బారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు చీదెళ్ల నారాయణ, మొగిలి గుప్త, వెచ్చా హరగోపాల్, నాగెళ్ల సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో ఆత్మార్పణ దినోత్సవం ఆర్యవైశ్య మహిళలు శుక్రవారం నిర్వహించారు. తెల్లవారు జామున అమ్మవారి నగర సంకీర్తన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి అమ్మవారిశాల వరకు కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తా అనంతయ్య శ్రీ వాసవీ అమ్మవారికి అభిషేకాలు, అర్చన, పూజలు చేసిన అనంతరం వచ్చిన భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పూర్ణనాగేశ్వరరావు, కందగట్ల శేఖర్, మహిళలు పాల్గొన్నారు.


హోమం చేస్తున్న భక్తులు

పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి బసవయ్య


గేదెకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బాలునాయక్


కురిచేడు: గొర్రెకు మందు తాగిస్తున్న పశువైద్య సిబ్బంది

పెద్దారవీడు: గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులు పశువుల పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యశాల డాక్టర్ బాలునాయక్ సూచించారు. మండలంలోని గుండంచర్లలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ పాల ఉత్పాదకతను పెంచేందుకు, వ్యాధులను నియంత్రించేందుకు ఉపయోగ పడుతుందని తెలిపారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు అందిస్తామన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ పశు వైద్యుడు అవార్డు పొందిన డాక్టర్ బాలునాయక్‌ను రైతులు ఘనంగా సత్కరించారు. వైద్య సహాయకులు ప్రసాద్, షేక్ ఇస్మాయిల్, అల్లాబక్షి, అమీర్‌బాషా, ఎం.వీరాంజనేయులు నాయక్, తులసీరామ్‌నాయక్, రాజారావు పాల్గొన్నారు.

దొనకొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ సూచన మేరకు కురిచేడు మండలంలో అన్ని గ్రామాల్లో గత నెల 20 నుంచి 31 వరకు పశువైద్య శిబిరాలు నిర్వహించినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ గంటా శ్రీనివాసరావు తెలిపారు. 35 వేల గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు తాగించినట్లు చెప్పారు. 1550 దూడలకు, 225 గేదెలకు నట్టల నివారణ, 125 గేదెలకు గర్భకోశ వ్యాధుల నివారణ, 325 గేదెలకు సాధారణ చికిత్సలు చేశామని చెప్పారు. 4500 గొర్రెలకు బొబ్బ వ్యాధి టీకాలు వేశామని ఆయన తెలిపారు. వైద్య శిబిరంలో పి.వెంకటరెడ్డి, ఐవీరెడ్డి, జి.ప్రసాద్, యాసిన్ పాల్గొన్నారు.

దర్శి: గోవుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి ఎం.బసవయ్య సూచించారు. మండలంలోని వెంకటాచలం పల్లెలోని గోశాలలో 80 గోవులకు, లేగ దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బసవయ్య మాట్లాడుతూ లేగ దూడలకు నట్టల నివారణ మందు తాగించామని చెప్పారు. గాయాలకు చికిత్స అందించామన్నారు. పశువులకు మినరల్ మిక్చర్, వాతం పాడి ప్యాకెట్‌లు అందజేశామన్నారు. ఆవులు, దూడలకు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్న చిన్న పుళ్లు వంటివి గమనిస్తే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది శివారెడ్డి పాల్గొన్నారు.